సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 28 । మార్చి । 2023



ఉత్తమ నాటికగా కొత్త పరిమళం

తాడేపల్లిగూడెం జీవీఆర్ కళాకేంద్రంలో 30వ జాతీయ ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. కొత్త పరిమళం నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. 8లో ▸



విద్యార్థులకు గాయాలు

భీమవరం పట్టణం దుర్గాపురంలో సోమవారం పాఠశాల విద్యార్థులతో వెళ్తున్న ఆటో ప్రమాదానికి గురవడంతో ఆరుగురు విద్యార్థులు, డ్రైవర్ గాయపడ్డారు. 8లో ▸

దేశ శాంతి కోసం యాత్ర

దేశంలో శాంతిని కాంక్షిస్తూ.. దైవదర్శన్ పేరుతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన చాట్రాజుల విజయగోపాలకృష్ణ కాశీ నుంచి రామేశ్వరం వరకు చేపట్టిన సైకిల్ యాత్ర సోమవారం తణుకుకు చేరింది.



8లో



	ఇఫ్తార్ మంగళవారం సాయంత్రం	సహరి బుధవారం వేకువజాము
భీమవరం	6.23	4.41
తాడేపల్లిగూడెం	6.25	4.49
నరసాపురం	6.22	4.40

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

కాళ్లకూరు వెంకన్న ఆదాయం రూ.14.55 లక్షలు



కాళ్లకూరు వెంకన్న ఆలయంలో హుండీల లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామికి హుండీల ద్వారా రూ.14,55,589 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈఓ చాగంటి సురేష్ నాయుడు తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, భీమవరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఈఓ కృష్ణంరాజు, ధర్మకర్తలు, భక్తుల సమక్షంలో సోమవారం హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. 66 రోజులకు హుండీ ఆదాయం లెక్కించినట్లు ఆయన తెలిపారు. ఏలూరుపాడు జ్ఞానానంద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, మహిళా భక్త బృందం సభ్యులు, గ్రామ పెద్దలు ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 33,752 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ థియరీ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఫిజిక్స్–2, ఎకనామిక్స్–2 పరీక్షలకు 106 కేంద్రాల్లో మొత్తం 34870 మంది విద్యార్థులకు 33752 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 11,176 మంది జనరల్ విద్యార్థులకు గాను 10813 మంది హాజరు కాగా, 1618 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1481 మంది హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో 15,583 మంది జనరల్ విద్యార్థులకు 15,194 మంది హాజరు కాగా 389 మంది గైర్హాజరయ్యారు. 1544 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1438 మంది హాజరు కాగా 106 మంది గైర్హాజరయ్యారు. తూర్పు గోదావరి జిల్లాలో 15 కేంద్రాల్లో 4,270 మంది జనరల్ విద్యార్థులకు 4,189 మంది హాజరు కాగా 81 మంది గైర్హాజరయ్యారు. 679 ఒకేషనల్ విద్యార్థులకు 637 మంది హాజరు కాగా 42 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా యండగండి కేంద్రంలో పిప్పర జూనియర్ కళాశాలకు చెందిన ఒక విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా స్క్వాడ్ పట్టుకున్నారని ఈ సంఘటన మినహా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే.చంద్రశేఖర బాబు తెలిపారు.

క్షయ నివారణలో జాతీయ అవార్డు



జిల్లా క్షయ నివారణాధికారి జి.రత్నకుమారిని సత్కరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): క్షయవ్యాధి రహిత దిశగా పురోగతి సాధించినందుకు ఏలూరు జిల్లా జాతీయ అవార్డు పొందడం ఆనందదాయకమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. క్షయ(టీబీ) వ్యాధి నియంత్రణలో ఏలూరు జిల్లా బంగారు పతకం పొందిన సందర్భంగా సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా క్షయ నివారణ అధికారి జి.రత్నకుమారిని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సత్కరించి అభినందించారు. సంబంధిత వైద్యాధికారులను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో క్షయ విస్తరించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ విషయంలో ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. 2025 నాటికి ఈ వ్యాధిని పూర్తిగా అంతం చేసే లక్ష్యంగా ప్రణాళిక అమలు చేయాలన్నారు.

హుండీ లెక్కింపు

నరసాపురం రూరల్: బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 41 రోజులకు రూ.10,60,400 ఆదాయం లభించినట్టు ఈవో డి.రామ్మకృష్ణంరాజు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధనీడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో లెక్కింపులో నిర్వహించారు.

అంగన్‌వాడీలకు ఆర్వో ప్లాంట్లు

- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సురక్షిత తాగునీరు
- జిల్లాలో తొలి విడతలో 300 అంగన్‌వాడీల్లో ఏర్పాటు
- ఒక్కొక్క ప్లాంట్‌కు రూ.24 వేల ఖర్చు





మార్టేరు అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్, సత్యవరం కేంద్రంలో ఆర్వో ప్లాంట్

భీమవరం (ప్రకాశంచౌక్): అంగన్‌వాడీ కేంద్రాల్లో సురక్షిత మంచినీరు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో మినీ ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తుంది. స్థానిక పంచాయతీలు సరఫరా చేసే కుళాయి నీరు లేదా బోరు నీటిని, కొన్ని చోట్ల వాటర్ ప్లాంట్ల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు ఉపయోగించుకుంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో సురక్షితమైన మంచినీరు అందేలా మినీ ఆర్వో ప్లాంట్‌లు ఉపయోగపడనున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంతవరకూ పిల్లలకు, గర్భిణులకు మంచి పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇకపై మంచి పౌష్టికాహారంతోపాటు సురక్షితమైన మంచినీటిని కూడా అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వర్షాకాలం, వేసవి కాలం, సీజనల్ వ్యాధుల సమయంలో కలుషిత నీరు తాగకుండా ఈ ఆర్వో ప్లాంట్ల నుంచి నీటిని అందించనున్నారు.

జిల్లాలో 300 కేంద్రాల్లో ఏర్పాటు

జిల్లాలో 1562 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 22 వేల మంది పిల్లలకు, 17 వేల మంది గర్భిణులు, బాలింతలకు సేవలు అందిస్తున్నారు. మొదటి విడతలో 300 కేంద్రాలకు మినీ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో మినీ ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. సొంత భవనాలు కలిగిన అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రాధాన్యత ఇస్తూ వాటిలో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. మొదటి విడతలో ఎంపిక చేసిన అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లను అమర్చడానికి చర్యలు తీసుకుంటున్నారు.

ఒక్కో ప్లాంట్‌కు రూ.24 వేలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న మినీ ఆర్వో ప్లాంట్‌కు సంబంధించి ఒక్కొక్క ప్లాంట్‌కు రూ.24 వేల చొప్పున ఖర్చు చేయనున్నారు. 15 లీటర్ల సామర్థ్యం గల ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా ఇది గంటకు 12 లీటర్ల నీటిని శుద్ధి చేస్తుంది.

నీటి సదుపాయం ఉంటే పైపుల ద్వారా ప్లాంట్‌లకు వాటర్ నింపి శుద్ధి చేస్తారు. నీటి సదుపాయం లేని చోట నీరు తీసుకువచ్చి ఆర్వో ప్లాంట్‌లో వేసి శుద్ధి చేసిన తర్వాత ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

మొదటి విడతలో 300 కేంద్రాల్లో ఏర్పాటు



అంగన్‌వాడీ కేంద్రాల్లో సురక్షిత మంచినీటి కోసం ప్రభుత్వం మినీ ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తుంది. దీనిలో భాగంగా జిల్లాకు సంబంధించి మొదటి విడత 300 అంగన్‌వాడీ కేంద్రాల్లో మినీ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లను అమర్చాం. దశలవారీగా మిగిలిన అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం.

– బి.సుజాతా రాణి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి, భీమవరం

జిల్లాలో వాటర్ ప్లాంట్లు

ప్రాజెక్ట్	మండలం	ప్లాంట్లు
నల్లజర్ల	తాడేపల్లిగూడెం	16
గణపవరం	గణపవరం	15
గణపవరం	పెంటపాడు	18
పెరవలి	తణుకు	15
మొగల్తూరు	మొగల్తూరు	17
మొగల్తూరు	నర్సాపురం	16
మొగల్తూరు	యలమంచిలి	15
పోడూరు	పోడూరు	18
పోడూరు	ఆచంట	12
పోడూరు	పాలకొల్లు	21
విస్సాకోడేరు	వీరవాసరం	15
విస్సాకోడేరు	పాలకోడేరు	15
విస్సాకోడేరు	భీమవరం	16
ఆకివీడు	ఆకివీడు	17
ఆకివీడు	ఉండి	15
ఆకివీడు	కాళ్ల	14
పెనుమంట్ర	పెనుమంట్ర	20
పెనుమంట్ర	ఇరగవరం	6
పెనుమంట్ర	అత్తిలి	4
పెనుమంట్ర	పెనుగొండ	15

గోదావరిలో ఘనంగా అమ్మవార్ల తెప్పోత్సవం



యలమంచిలి మండలం దొడ్డిపట్లలో తెప్పోత్సవం కోసం ఏర్పాట్లు

యలమంచిలి: దొడ్డిపట్ల గ్రామ దేవతలు మాణిక్యాలమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్లకు ఉగాది సందర్భంగా జాతర ఉత్సవాలలో ఆదివారం రాత్రి వశిష్ఠ గోదావరి నదిలో తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు, శ్రీ చక్రానికి వశిష్ఠ గోదావరి నదిలో హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉగాది రోజున ప్రారంభమైన ఉత్సవాలు ఐదు రోజులపాటు జరిగాయి. భక్తులు ఈ ఐదు రోజులు అమ్మవార్లకు చలివిడి, పానకాలు సమర్పించారు. ఆలయ అర్చకులు చేబ్రోలు సుబ్బరాయశర్మ బ్రహ్మత్వంలో అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తెప్పోత్సవం అనంతరం అమ్మవార్లను ఆలయానికి తీసుకువచ్చి ఊయల ఉత్సవం, దండాడింపు కార్యక్రమం నిర్వహించి ఆలయ ప్రవేశ చేయడంతో జాతర ఉత్సవాలు ముగిసాయి.

సంక్షేమ పథకాలతో మహిళలకు ఆర్థిక చేయూత

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి అమలు చేస్తున్న పథకాలతో మహిళలు ఆర్థిక స్వాంతన చెందుతున్నారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మాగంటి కళ్యాణ మండపంలో తాడేపల్లిగూడెం మండల డ్వాక్రా సంఘాలకు 3వ విడత వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ వైఎస్సార్‌సిపి ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తుందన్నారు. దీనిద్వారా దళారీ వ్యవస్థ కనుమరుగైందని చెప్పారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు మోసం చేసిన తీరును మహిళలు ఇంకా మర్చిపోలేదన్నారు. చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ ఎన్ని కుట్రలు చేసినా జగన్‌ను ఏమీ చేయలేరన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి తిరిగి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా 1548 గ్రూపులకు రూ.12.23 కోట్లు చెక్కును అందచేశారు.

104 అంబులెన్స్‌లు ప్రారంభం : తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలకు రెండు 104 అంబులెన్స్‌లు మంజూరయ్యాయి. వాటిని సోమవారం ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. మంత్రి కొట్టు పచ్చ జెండా ఊపి వాటిని ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ వేణుగోపాల్, రూరల్ ఏపీఎం లక్ష్మి, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, జడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ముప్పిడి సంతప్‌కుమార్, వెలిశెట్టి నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో ఫిర్యాదుల స్వీకరణ



భీమవరం డీఎస్పీ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: స్పందనలో పోలీసు శాఖకు వస్తున్న ఫిర్యాదుల పట్ల సంబంధిత అధికారులు తక్షణం స్పందించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. సోమవారం భీమవరం డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించి వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరకట్నం వేధింపులు, సరిహద్దుల విషయంలో గొడవలు, సివిల్ వివాదాలకు సంబంధించి 16 ఫిర్యాదులందాయి. తన భర్తతో గొడవల కారణంగా విడాకుల కేసు కోర్టులో ఉందని అయితే కేసు వాయిదాకు వచ్చినపుడు తన భర్త కొట్టి బెదిరిస్తున్నాడని పాలకోడేరు గ్రామానికి చెందిన మహిళ ఫిర్యాదు చేసింది. తన కుమారుడికి ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగం ఇప్పిస్తానని ఒక వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని అతనిపై చర్యలు తీసుకోవాలని పాలకొల్లు పట్టణానికి చెందిన మహిళ ఫిర్యాదు చేసింది. అనంతరం ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కొంతమంది సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాలకు కేవైసీ చేయాలని చెప్పి పంపించే మెసేజ్‌లు, ఎలక్షన్ ఐడెంటిటీ కార్డుకు పాన్‌కార్డును జత పరచాలని చెప్పే అపరిచితుల మాయామాటలు నమ్మవద్దన్నారు.

● ముందే వచ్చిన మామిడి



మామిడి పండ్లు ఈ ఏడాది ముందే వచ్చేశాయి. సాధారణంగా ఏప్రిల్, మే నెలలో సీజన్ మొదలవుతుంది. కానీ మార్చి నెలలోనే మామిడి పండ్లు రావడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కాళ్ల మండలం సీసలి వద్ద రసాలు, బంగినపల్లి రకాలు విక్రయిస్తున్నారు. బంగినపల్లి పరక రూ.400 నుంచి రూ.650 వరకు, రసాలు రూ. 500 నుంచి రూ.900 వరకు విక్రయిస్తున్నారు. కలిదిండి తోటల్లోనుంచి పండ్లను దిగుమతి చేసుకున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. - కాళ్ల

ఫ్యామిలీ డాక్టర్ భేష్

పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకులో 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి, చిత్రంలో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: పేదవర్గాలకు ఉచిత వైద్యసేవలు మరింత చేరువ చేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా తణుకు నియోజకవర్గానికి చెందిన ఇరగవరం, అత్తిలి మండలాల 104 వాహనాలు మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి 104 వాహనం ద్వారా ఒక ఫిజీషియన్ వెళ్లి ఉచితంగా వైద్యసేవలందించి మందులు పంపిణీ చేస్తారని అన్నారు. ప్రైవేటు వైద్యం ఖరీదైన నేటి రోజుల్లో ముఖ్యమంత్రి వైద్యానికి ఎంతో ప్రాధాన్యత కల్పిస్తూ వైద్య కళాశాలలు, వైఎస్సార్ క్లినిక్‌లు ఏర్పాటుచేశారని అన్నారు. అనంతరం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ఉందుర్తి పాల్ ఫౌండేషన్ సమకూర్చిన పోషకాహారాన్ని క్షయ వ్యాధిగ్రస్తులకు అందచేశారు. నియోనాటల్ 108 వాహనంలో ఉన్న సౌకర్యాలను ప్రత్యేకంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివప్రసాద్, పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు, డాక్టర్ బంగారు రవిరాజు, వైద్యులు, జిల్లా వైద్యవిభాగం అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఎస్సీ సెల్ తణుకు మండల అధ్యక్షులు జంగం ఆనంద్‌కుమార్, మారిశెట్టి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి ఎత్తిపోతలకు మంచి రోజులు

- ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.279 కోట్లు కేటాయింపు
- వేగవంతమవనున్న కాలువ తవ్వకం
- కరోనాతో మూడేళ్లుగా మందగించిన పనులు



మెట్ట ప్రాంతంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ తవ్వకం పనులు



చీపిరిగూడెం సమీపంలో తమ్మిలేరుపై పూర్తికావచ్చిన భారీ అక్విడెక్ట్ నిర్మాణం

చింతలపూడి : చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో రూ.279 కోట్లు కేటాయించింది. దీంతో కాలువ తవ్వకం పనులు వేగం పుంజుకోనున్నాయి. 2020 ఫిబ్రవరి నెలలో నాబార్డు నుంచి చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రూ.1,931 కోట్ల రుణం మంజూరయింది. రెండేళ్లలో ఈ పథకాన్ని పూర్తి చేయాలని భావించిన ప్రభుత్వానికి కరోనా వైరస్ వల్ల గత రెండు, మూడేళ్లుగా పనులు ముందుకు సాగలేదు. పథకం ప్రాథమిక అంచనా రూ.1,701 కోట్లు కాగా, సవరించిన అంచనాల ప్రకారం రూ.4,909.80 కోట్లకు పెరిగింది.

వైఎస్ కలల ప్రాజెక్ట్

చింతలపూడి ఎత్తిపోతల పథకం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కలల ప్రాజెక్టు. 2003లో పాదయాత్ర సమయంలో జిల్లాలోని మెట్ట ప్రాంత రైతులు సాగు నీటికోసం పడే ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశారు. అధికారంలోకి వస్తే మెట్టకు గోదావరి జలాలను మళ్లించి సాగునీరు అందిస్తానని రైతులకు వైఎస్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రిగా చింతలపూడి ఎత్తిపోతల పథకానికి 2008 అక్టోబరు 30వ తేదీన కామవరపుకోటలో వైఎస్ స్వయంగా శంకుస్థాపన చేశారు. ఉరుకులు, పరుగులు పెట్టిన ఈ పథకం పనులకు వైఎస్ అకాల మరణంతో గ్రహణం పట్టింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల రైతులకు సాగునీరు, ప్రజలకు తాగు నీరు అందించేందుకు పట్టుదలతో ఉన్నారు. ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్‌బాబు, చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ప్రాజెక్టు పరిస్థితిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఇటీవల అసెంబ్లీలోనూ ఎమ్మెల్యే ఎలీజా ప్రాజెక్టు పరిస్థితిని వివరించారు.

4.80 లక్షల ఎకరాలకు సాగు నీరు

కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 15 మెట్ట ప్రాంత మండలాల్లో 2.10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం ఈ పథకం ముఖ్యోద్దేశం. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం గుడ్డిగూడెం ఎత్తిపోతల పథకాన్ని విస్తరించి చింతలపూడి పథకానికి అనుసంధానం చేశారు. తద్వారా కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలో 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా మరో రూ.3,200 కోట్లు కేటాయించారు. 53.50 టీఎంసీల గోదావరి నీటిని వాడుకునేలా కాలువల సామర్థ్యాన్ని పెంచనున్నారు. గోదావరి నీటిని ప్రధాన కాలువ నుంచి కృష్ణా జిల్లా వేంపాడు కాలువకు గోదావరి నీటిని మళ్లిస్తారు. ఇందుకోసం రెండు జిల్లాల సరిహద్దులో చీపిరిగూడెం వద్ద తమ్మిలేరు కాలువపై చేపట్టిన అక్విడెక్ట్ నిర్మాణం పూర్తి కావచ్చింది. పశ్చిమ గోదావరి జిల్లా యర్రగుంటపల్లి వద్ద నుంచి కృష్ణా జిల్లా చాట్రాయి మండలం వేంపాడు కాలువ పొడవు 14 కిలోమీటర్లు. ఇప్పటి వరకు 2.5 కిలో మీటర్ల తవ్వకం పనులు పూర్తి చేశారు. రైతుల నష్ట పరిహారంలో తలెత్తిన వివాదంతో రైతులు కాలువ తవ్వకం పనులను అడ్డుకున్నారు. నష్టపరిహారం సమస్య పరిష్కరించి కాలువ తవ్వుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ప్రాజెక్టు పనులకు బడ్జెట్‌లో రూ.279 కోట్లు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తాం. కరోనా కారణంగా పనులు నిలిపి వేయడం వల్ల ఆలస్యమైంది.ఈ పథకాన్ని పూర్తి చేసి సాగునీరు, తాగునీరు అందించేందుకు కట్టుబడి ఉన్నాం.

– ఉన్నమట్ల ఎలీజా, ఎమ్మెల్యే, చింతలపూడి

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల : స్థానిక శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు తాడేపల్లిగూడెంకు చెందిన సత్తి రవీంద్రారెడ్డి సోమవారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు. తొలుత రవీంద్రారెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శించారు.

ఉత్తమ నాటిక కొత్త పరిమళం

● ప్రేమతో నాన్నకు ద్వితీయం
● ముగిసిన నాటిక పోటీలు


ఉత్తమ నాటిక కొత్త పరిమళం


ద్వితీయ ఉత్తమ ప్రదర్శన ప్రేమతో నాన్న


తృతీయ ఉత్తమ ప్రదర్శన మనస్సునమనస్సై

తాడేపల్లిగూడెం : ఇండియా పాకిస్తాన్ దేశాల సరిహద్దుల వద్ద సమస్యలకు అద్దం పట్టిన కొత్త పరిమళం నాటిక బీవీఆర్ కళాకేంద్రంలో నిర్వహించిన 30వ జాతీయ ఆహ్వాన నాటిక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. దీనిని శర్వాణి గ్రామీణ గిరిజన సంఘం, బోరివంక, శ్రీకాకుళం వారు ప్రదర్శించారు. ఆదివారం అర్ధరాత్రితో నాటిక పోటీలు ముగిశాయి. ఫలితాలను న్యాయనిర్ణేతలు ప్రకటించారు. సంసారాల్లో వేధింపులను ఎదుర్కొని ఎలా కాపురాలు చేసుకోవాలనే అంశంతో ఈ ప్రదర్శించిన ప్రేమతో నాన్న నాటిక ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. దీనిని శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారు ప్రదర్శించారు. జీవిత చరమాంకంలో భార్యాభర్తలను వేరువేరుగా ఉంచకూడదని, వారి తనువులు వేరైనా, మనస్సు ఒకటే అనే ఇతివృత్తంతో హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఏలూరు వారు ప్రదర్శించిన మనస్సున మనస్సై నాటిక తృతీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. కొత్త పరిమళం టీమ్‌కు నూతలపాటి సాంబయ్య మాస్టారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక నాటక కళాపరిషత్‌ల సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు జ్ఞాపికలను అందజేశారు.


కొత్త పరిమళం టీమ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న చిత్రం

విజేతలు వీరే..

ఉత్తమ జ్యూరీ ప్రదర్శన : అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరు వారి నాన్నా నేనొచ్చేస్తా నాటిక
ఉత్తమ రచన : కొత్త పరిమళం రచయిత కేకేఎల్ స్వామి
ఉత్తమ దర్శకత్వం : కొత్త పరిమళం దర్శకుడు బీఎంఎస్ పట్నాయక్
ఉత్తమ నటుడు : పి.విజయకుమార్ (మనస్సున మనస్సై)
ద్వితీయ ఉత్తమ నటుడు : సీవీఆర్ మూర్తి (ప్రేమతో నాన్న)
ఉత్తమ నటి : ఎస్.అమృతవర్షిణి (నాన్నా నేనొచ్చేస్తా)
ద్వితీయ ఉత్తమ నటి : వై.భవాని (మృత్యుపత్రం)
ఉత్తమ ప్రతినాయకుడు : బి.చలం (కొత్త పరిమళం)
ఉత్తమ హాస్యనటుడు : యూవీ శేషయ్య (పక్కింటి మొగుడు)
ఉత్తమ క్యారెక్టర్ నటుడు : బి.శోభన్‌బాబు (కొత్త పరిమళం)
ఉత్తమ సహాయనటుడు : డి.సాంబమూర్తి (కొత్త పరిమళం)
ఉత్తమ క్యారెక్టర్ నటి : సురభి ప్రభావతి (ప్రేమతో నాన్న)
ఉత్తమ సంగీతం : సాయితేజ (మనస్సున మనస్సై)
ఉత్తమ ఆహార్యం : ఎస్.రమణరావు (కొత్త పరిమళం)
ఉత్తమ రంగాలంకరణ : ఎల్.అనిల్ చౌదరి (మృత్యుపత్రం)
ఉత్తమ రంగోద్దీపనం : మహమ్మద్ ఖాజావలీ(మనస్సున మనస్సై)
జ్యూరీ అవార్డు 01 : ఇ.పున్నయ్య చౌదరి (ప్రక్షాళన)
జ్యూరీ అవార్డు 02 : ఎస్‌కేడీ హసన్ (నాన్నా నేనొచ్చేస్తా)

బాలికపై అత్యాచారం కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ఏలూరు టౌన్/కామవరపుకోట: జిల్లాలోని టి.నరసాపురం మండలం తెడ్లెం గ్రామానికి చెందిన బాలికపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారం చేసి చంపుతామంటూ బెదిరించిన కేసులో ఏలూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్.ఉమాసునంద సోమవారం తుదితీర్పు వెలువరించారు. కామవరపుకోట మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన కోట నవీన్, అదే గ్రామానికి చెందిన తాళ్లూరి రాజశేఖర్ అలియాస్ సొంగ తంబి అలియాస్ తాళ్లూరి తంబి అనే ఇద్దరికీ జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.1 లక్ష నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలిచ్చారు.

బాలికను నమ్మించి..
ఏడో తరగతి చదివిన తెడ్లెం గ్రామానికి చెందిన బాలిక కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. 2016వ సంవత్సరంలో బాలిక నాన్నమ్మ గ్రామం గుంటుపల్లికి వెళ్లి అదేరోజు రాత్రి సుమారు 7.55 గంటలకు తన స్వగ్రామం వెళుతోంది. మార్గ మధ్యంలో బాలికకు బంధువులైన గుంటుపల్లికి చెందిన నవీన్, తంబిలు 'మీ నాన్నవద్దకు పంపుతాం' అని నమ్మించారు. మద్యం సేవించి ఉన్న వారిద్దరూ బాలిక అరవకుండా ఆమె నోటిలో చున్నీ పెట్టి సమీపంలోని పాకలోకి తీసుకెళ్లారు. తెల్లవారుజాము వరకు ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించారు. కొన్ని రోజులకు బాలిక పరిస్థితిపై అమ్మమ్మకు అనుమానం వచ్చి ఆరా తీయగా విషయం బయటపడింది. ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేయించగా బాలిక గర్భిణిగా నిర్ధారించారు. తడికలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నాటి ఎస్సై జి.విశ్వనాథం కేసు నమోదు చేశారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ జె.వెంకట్రావు కేసు విచారణ పూర్తిచేసి కేసు చార్జిషీటును కోర్టుకు సమర్పించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ తేతలి శశిధర్ రెడ్డి సాక్షాలను కోర్టువారికి నివేదించి ముద్దాయిలకు జీవిత ఖైదు విధించటంలో కీలకపాత్ర పోషించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ పి.బాలసురేష్‌బాబు, దిశా పోలీస్‌స్టేషన్ ఏలూరు సీఐ కె.ఇంద్రశ్రీనివాస్, తడికలపూడి ఎస్సై కె.వెంకన్న, కోర్టు హెచ్‌సీ కె.కొండలరావును ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ అభినందించారు.

శాంతి కోసం దైవదర్శన్ యాత్ర


తణుకు చేరుకున్న విజయగోపాలకృష్ణ సైకిల్ యాత్ర

తణుకు: దేశంలో శాంతి నెలకొల్పాలని కోరుతూ శాంతి దైవదర్శన్ పేరుతో కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సింధనూరు పట్టణానికి చెందిన చాత్రాజుల విజయగోపాలకృష్ణ కాశీ నుంచి రామేశ్వరం వరకు గతేడాది మార్చి 11న చేపట్టిన సైకిల్ యాత్ర సోమవారం తణుకు చేరింది. ఇప్పటి వరకు ఘనాపూర్, తుల్జాపూర్, షిర్డీ, నాసిక్, త్రయంబకేశ్వరం, గుజరాత్‌లోని నర్మదనది, నాందేడ్, బాసర, త్రివేణి, కాశీ, అయోధ్య, ఆగ్రా, లక్నో, హరియానా, పంజాబ్, సింధునదీ ప్రాంతాలు, తమిళనాడులోని కంచి, మధుర, కన్యాకుమారి, కేరళలోని తిరువనంతపురం, గురునాయర్, తలసేరు, కర్నాటకలోని మైసూర్, బెంగళూరు, ధర్మస్థలం, ఉడిపి, గోకర్ణ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రముఖ ఆలయాలు, నదులను ఆయన సందర్శించారు. మన రాష్ట్రంలోని తిరుపతి, విజయవాడ దర్శనం చేసుకుని తణుకు మీదుగా రాజమహేంద్రవరం బయల్దేరారు. ఉదయం పర్యటన మొదలుపెడుతూ మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటూ రాత్రి సమయాల్లో ఆలయాల్లో సేదతీరుతూ ఇప్పటి వరకు సుమారు 28 వేల కిలోమీటర్లు తన సైకిల్ యాత్ర పూర్తి చేశానని, 13 రాష్ట్రాల్లోని 12 నదులను సందర్శించానని విజయ్‌గోపాలకృష్ణ తెలిపారు.

ఆటో ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు


గాయపడిన వారితో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనాథ్, సీఐ కృష్ణకుమార్


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణం దుర్గాపురంలోని బీవీ రాజు మార్గ్‌లో సోమవారం పాఠశాల విద్యార్థులతో వెళుతున్న ఆటో డివైడర్‌ను ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు విద్యార్థులు, డ్రైవర్ గాయపడ్డారు. పాలకోడేరు, ఉండి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు సోమవారం ఉదయం భీమవరంలోని ఒక ప్రైవేటు పాఠశాలకు వస్తున్నారు. ఆటో బీవీ రాజు మార్గ్ వద్దకు వచ్చేసరికి మోటారుసైకిల్ అడ్డుగా రావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆటోలోని విద్యార్థులు, పుస్తకాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డారు. డ్రైవర్ జి.ఆనందరావు, గొల్లలకోడేరు గ్రామానికి చెందిన విద్యార్థులు ఎస్ స్వర్ణవిశాల్, ఎస్ సువర్ణవికాస్, కె.మనోజ్ఞసాత్విక, కె.భార్గవి, పాలకోడేరుకు చెందిన పి.ప్రవీణ్, జి.సంజన గాయపడ్డారు. క్షతగాత్రులను పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలలో చేర్పించారు. భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్, టుటౌన్ సీఐ బి.కృష్ణకుమార్ ఘటనా స్థలిని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి


రైలు కింద పడి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పాలకొల్లు (సెంట్రల్): పాలకొల్లు రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే పోలీసులు సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటల సమయంలో రెండో ప్లాట్ ఫారం రైలు పట్టాల వద్ద వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు చెప్పడంతో పరిశీలించామన్నారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అతని వయసు సుమారు 60 ఏళ్ల ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు భీమవరం రైల్వే ఎస్సై రమణ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

నీటిగుంటలో పడి వికలాంగుడు మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఓ వికలాంగుడు నీటిగుంటలో పడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. కొమరాడ రోడ్డులోని యూనోఫీడ్స్ వద్ద బీహార్‌కు చెందిన యవజేష్ రాయ్ (32) తన స్నేహితుడు జి.తేంద్రకుమార్ వద్దకు వస్తూ.. ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతి చెందినట్టు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మోహన్‌రావు చెప్పారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి


ఈలి మణికంఠ నాయుడు (32)

పాలకొల్లు అర్బన్: దిగమర్రు – చించినాడ జాతీయ రహదారిలో దిగమర్రు వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తూర్పుగోదావరి జిల్లా కాట్రేనికోన మండలం పెనుమాల గ్రామానికి చెందిన ఈలి మణికంఠనాయుడు (32) మృతి చెందారు. మణికంఠ నాయుడు తన భార్య రామదుర్గతో కలిసి పాలకొల్లులో బంధువుల ఇంటికి వివాహానికి హాజరై తిరిగి వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. చించినాడ వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వీరిని ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలైన రామదుర్గ పాలకొల్లులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. హోల్‌సేల్ చికెన్ వ్యాపారి మణికంఠనాయుడుకు వివాహమై 46 రోజులు గడచినట్టు బంధువులు తెలిపారు. మణికంఠనాయుడు చిన్నాన్న కాశీ విశ్వనాథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్‌వీఎం మూర్తి తెలిపారు.

శ్రీవారి కొండపై అదుపుతప్పిన టిప్పర్ లారీ

డ్రైవర్ అప్రమత్తతో తప్పిన పెనుప్రమాదం

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపై సోమవారం ఒక టిప్పర్ లారీకి స్టీరింగ్ వదిలేయడంతో వేగంగా ముందుకు దూసుకెళ్లింది. దాంతో ఆ ప్రాంతంలో ఉన్న భక్తులు భయాందోళనతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. టిప్పర్ డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. కొండపై చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించిన పాత ప్రసాదాల కౌంటర్ శిథిలాలను టిప్పర్ల ద్వారా కేశ ఖండనశాల వెనుక ప్రాంతానికి తరలిస్తున్నారు. ఈ క్రమంలోనే లోడుతో వెళుతున్న ఒక టిప్పర్ స్టీరింగ్ వదిలేయడంతో స్థానిక జంటగోపురాల ప్రాంతంలో వాహనం అదుపుతప్పింది. దీంతో అక్కడున్న భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ చాకచక్యంగా వాహనాన్ని అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది.

వరి పరిశోధన స్థానంలో 29న కిసాన్ మేళా

పెనుమంట్ర: మార్టేరు వరి పరిశోధన స్థానంలో ఈ నెల 29న కిసాన్ మేళా నిర్వహించనున్నట్టు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ పి.శ్రీనివాస్ చెప్పారు. వరి పరిశోధన స్థానంలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కిసాన్ మేళాలో సుస్థిర వ్యవసాయం, స్థిరమైన ఆదాయం అనే అంశంపై చర్చా వేదిక నిర్వహిస్తామన్నారు. సమావేశానికి వచ్చే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రైతులంతా ముందుగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. క్షేత్ర సందర్శన, వ్యవసాయ పనిముట్ల ప్రదర్శన ఉంటుందని చెప్పారు. రైతులకు క్విజ్ పోటీలు, శాస్త్రవేత్తల చర్చా గోష్ఠి ఉంటుందన్నారు. సభాధ్యక్షులుగా ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు వ్యవహరిస్తారని, ముఖ్య అతిథులుగా వ్యవసాయ సహకార, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాసాని గోవర్ధనరెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆదాల విష్ణు వర్ధన్‌రెడ్డి, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు.

15 ఏళ్లు దాటిన వాహనాలు తుక్కుకే

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 15 సంవత్సరాలు దాటిన ప్రభుత్వ వాహనాలతోపాటు 15 ఏళ్ల వాణిజ్య వాహనాలు, 20 ఏళ్లు దాటిన వ్యక్తిగత వాహనాలు సామర్థ్య పరీక్షల్లో విఫలమైతే వాటినీ తుక్కుగా మార్చే విధానాన్ని కేంద్రం వచ్చే ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి తేనుందని ఏలూరు ఉప రవాణా కమిషనర్ కె.శ్రీహరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాహనం ప్రారంభ నమోదు తేదీ నుంచి 15 ఏళ్లు దాటకుండా రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేయబడిన వాహనాలు కూడా వాటి రిజిస్ట్రేషన్ రద్దు చేసి, వాటినీ తుక్కుకు తరలించాలని కేంద్రం సూచించిందన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 15ఏళ్లు దాటిన ప్రభుత్వ వాహనాల వివరాలను తమ కార్యాలయానికి తెలపాలని కోరారు.

ఎర, బుట్టలతో పండు ఈగ నివారణ

నూజివీడు: మామిడిలో పండుఈగ బెడదను అరికట్టేందుకు ఎరలను, బుట్టలను ఎకరాకు ఐదు నుంచి ఆరు ఏర్పాటు చేసుకోవాలని మామిడి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త బి.కనకమహాలక్ష్మి సోమవారం తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు పండుఈగ ఉధృతి ఎక్కువయ్యే ప్రమాదం ఉందని, ఇది కాయలను ఆశించి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుందని హెచ్చరించారు. మామిడి పరిశోధన స్థానంలో ఎర రూ.40, బుట్ట రూ.100 చొప్పున విక్రయిస్తున్నామని, రైతులు వీటి ద్వారా పండు ఈగ బెడద నుంచి మామిడి కాయలను కాపాడుకోవచ్చని అన్నారు.

పంట ధ్వంసంపై కేసు నమోదు

టి.నరసాపురం: పంట ధ్వంసంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. పెదవేగి మండలం మొండూరుకు చెందిన బలుసు శ్రీనివాసచౌదరికి టి.నరసాపురం మండలం గుడ్లపల్లిలో తొమ్మిది ఎకరాల పొలం ఉందన్నారు. ఇందులోని ఎనిమిది 8 ఎకరాల్లో పామాయిల్ తోట, ఒక ఎకరంలో మొక్కజొన్న వేశారని తెలిపారు. ఈ నెల 20న దెందులూరుకు చెందిన కొడాలి శ్రీకృష్ణ వరప్రసాద్ తన ఇద్దరు కుమార్తెలతో కలిసి తన పొలంలోకి ప్రవేశించి, ట్రాక్టర్‌తో మొక్కజొన్న పంటను దున్ని రూ.లక్ష మేర నష్టాన్ని కలిగించాడని శ్రీనివాస చౌదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

ఇంటింటికీ ప్రభుత్వ వైద్యం


104 వాహనాన్ని పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా ప్రభుత్వం ద్వారా ఇంటింటికి ఉచిత వైద్యం అందించడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గూడెంలో ఆయన పెంటపాడు మండలానికి1, గూడెం మండలానికి 1 ఉచితంగా అందిన రెండు 104 వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఎస్ వెంకటరమణ, తోట రాజేష్, పూజిత తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరులో సొసైటీ సర్వ సభ్య సమావేశం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామ ప్రాథమిక సహకార సొసైటీ సర్వ సభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం నిర్వహించారు. సోమవారం వేల్పూరులోని సొసైటీ ఆవరణలో జరిగిన ఈ సమావేశానికి సొసైటీ చైర్‌పర్సన్ పెనుమర్తి వెంకట్రామన్న అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సబ్ డివిజనల్ సహకార అధికారి శ్రీనివాసరావు పాల్గొని సహకార రంగంలో రైతులకు అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. ఈకార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, సొసైటీ డైరెక్టర్లు గుత్తుల సూర్యనారాయణ, దేవపాటి నాగ సత్య వెంకట కనక మహాలక్ష్మీ, సొసైటీ సీఈవో గాదిరాజు అజయ్ కృష్ణంరాజు, నాయకులు సొసైటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పాత విధానంలోనే అగ్రిమెంట్ చేయాలని ధర్నా


నిరసన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

తణుకు: కార్మికుల పొట్టకొట్టే టెండర్ విధానం రద్దు చేసి కార్మికులకు పాత పద్ధతిలోనే అగ్రిమెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. సోమవారం టెండర్ విధానం రద్దు కోరుతూ స్థానిక ఏపీ సీడ్స్ ఎదుట కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఎక్కడా లేని టెండర్ విధానం తణుకు సీడ్స్‌లో ఎందుకు ప్రవేశపెడుతున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.దక్షిణామూర్తి, గార రంగారావు, టి.రామకృష్ణ, జి.త్రిమూర్తులు, కె.వరలక్ష్మి, ఎన్.లక్ష్మి, ఎం.నాగమణి, డి.నూకరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీర్మానంపై హర్షం

పెంటపాడు: దళిత క్రైస్తవులను ఎస్సీ హోదా కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్రానికి పంపించడంపై క్రిష్టియన్ సంఘ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో హర్షం తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ బిషప్ కౌన్సిల్ తరపున జిల్లా అధ్యక్షుడు బిషప్ కంది కొండ రత్నరాజు మట్లాడుతూ గత 26 ఏళ్లుగా దళిత క్రిష్టియన్లను ఎస్సీల జాబితాలో చేర్పించాలని కోరుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు చేస్తున్నారన్నారు. వారికి ఎస్సీ హోదా కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం మంచి పరిణామమని, సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఉలంపర్తి రమేష్ కుమార్, కోశాధికారి డాక్టర్ ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ డేవిడ్ బి. ఇమ్మానియేలురాజు, జార్జ్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

భీమవరం(ప్రకాశంచౌక్) : పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియున్న శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీలను సోమవారం లెక్కించారు. 59 రోజులకు గాను రూ.3,63,880 నగదు వచ్చిందని ఈఓ గంగా శ్రీదేవి తెలిపారు.

పేదల పాలిట వరంగా ఫ్యామిలీ ఫిజీషియన్

గ్రామాల్లో ఉచిత వైద్యపరీక్షలు

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేదలపాలిట వరంగా మారింది. గ్రామాల్లో ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందుతున్నాయి. దీర్ఘకాలిక రోగులకు, ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు చేయించుకొన్న వారు, గర్భిణీలు, బాలింతలకు పరీక్షల నిమిత్తం గతంలో పట్టణాలకు వెళ్లేవారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం అమలులోకి వచ్చిన అనంతరం నిర్దేశిత సమయంలో రోగుల ఇళ్లవద్దకు వైద్యులు వచ్చి పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. గతంలో ఎన్ని చిన్నజబ్బులు చేసినా, పెద్ద జబ్బు వచ్చినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పట్టణాలకు పరుగుపెట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నిర్ధేశిత సమయంలో గ్రామాల్లో వైద్యబృందం వచ్చి రోగులకు నిశితంగా పరీక్షలు చేసి అందుకు అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఈ వైద్య బృందాలు వచ్చేటప్పటికి విశేష స్పందన కనిపిస్తోంది. గూడెం నియోజకవర్గంలో 50కి పైగా గ్రామాల్లో 309 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో సుమారు 25 వేల మంది వైద్యసేవలు పొందారు. దీంతో పేదలకు ఆరోగ్యంపై భరోసాకలిగింది. మాకు ఏ జబ్బు చేసినా ప్రభుత్వం ఉందిలే అన్న ధీమా వారిలో కనిపిస్తోంది. షుగర్, బీపీ పేషెంట్లకు భరోసా, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వయస్సుతో సంబంధం లేకుండా షుగర్, బీపీ వంటి రోగాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. వీటివల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారు. పేద ప్రజలు వీటికి వైద్యం చేయించుకోలేక, మందులు కొనుగోలు చేసుకోలేక ప్రాణాల మీదకు తెచ్చుకొన్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వమే వైద్యులను పంపించి ప్రతి నెలా రక్త , యూరిన్, తదితర పరీక్షలు చేయిస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో గూడెం నియోజకవర్గంలో సుమారు 10 వేల మంది బీపీ, షుగర్ రోగులకు సేవలు అందుతున్నాయి.


ఫ్యామిలీ వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రతీనెల పరీక్షలు



ప్రతీనెలా వైద్యబృందం గ్రామానికి వచ్చి రక్త, యూరిన్ పరీక్షలు చేసి మందులు ఇస్తున్నాము. వారంలో రెండు లేక, మూడు రోజులు గ్రామాల్లో ఉండి పరీక్షలు చేస్తున్నాము. ప్రజలకు కూడా వీటికి అలవాటయ్యారు. రిఫరల్ కేసులు కూడా చెక్ చేస్తున్నాం. ఆరోగ్యశ్రీ లో ఆపరేషన్‌లు చేయించుకొన్న వారికి కూడా ప్రత్యేక దృష్టితో చూస్తున్నాం. – వి. మౌనిక, మెడికల్ అధికారి, పెంటపాడు

మెరుగైన వైద్యం



నాకు షుగర్ ఉంది. ప్రతీ నెలా గూడెం తీసుకు వెళ్లి పరీక్షలు చేయించేవారు. ఇంట్లో ఆర్థిక ఇబ్బంది. పని మానుకొని నన్ను పట్టణం తీసుకెళ్లేవారు. ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ పుణ్యమా అంటూ ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. జీవితంపై ఆశ కలుగుతోంది. ఈ కార్యక్రమం ప్రవేశపెట్టిన సీఎంకు కృతజ్ఞతలు. – తుమ్మూరి రవీంద్రబాబు, పరిమెళ్ల

క్షణంలో వైద్యం

చిన్నవయస్సులో బీపీ వచ్చింది. దీని వల్ల అనేక సార్లు ఇబ్బంది పడ్డాను. గ్రామాల్లోకి ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య బృందం వచ్చిందని చెప్పడంతో చూపించుకున్నాను. అక్కడ సమయం వృధా లేకుండా క్షణంలో వైద్యం అందిస్తున్నారు. డబ్బు ఇచ్చి గంటల తరబడి ఆసుపత్రులతో సేవలు పొందే కంటే ఇక్కడ మనపై ఎంతో అప్యాయత చూపిస్తూ ఇంటికే వచ్చి వైద్యం అందిస్తున్నారు. – లింగంపల్లి నాగశ్రీనివాస్, పడమరవిప్పర్రు

అందుబాటులో ఉంటున్నాం



గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న గ్రామ హెల్త్ క్లినిక్‌లకు వైద్యాధికారులు, ఎఎన్ఎంలు ,సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు అందుబాటులో ఉంటున్నారు. ముఖ్యంగా షుగర్, బీపీ రోగులకు సేవలు అందిచడమే కాక గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నాం. ఆరోగ్యశ్రీ చికిత్సలు చేయించుకొన్న రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. – డాక్టర్ పూజిత, ముదునూరు పీహెచ్‌సీ

స్పందనకు రెండు అర్జీలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, మున్సిపల్ శాఖలకు సంబంధించి రెండు అర్జీలు అందాయని ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎన్.వేణు గోపాల్ తెలిపారు. సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపించామన్నారు. తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నియోజకవర్గంలో ఎనిమిది కేంద్రాల్లో సోమవారం ప్రశాతంగా జరిగాయి. ఫిజిక్స్–2, ఎకనామిక్స్–2 పరీక్షలు జరిగాయి. జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 2,528మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 2,467 మంది పరీక్షలు రాశారు. 61 మంది పరీక్షలకు హాజరు కాలేదు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ విడుదలపై హర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ టీచర్స్ ఏకీకృత సర్వీస్ రూల్స్ విడుదల చేయడం పట్ల ఏపీటీఎఫ్ సభ్యులు హర్షం ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ మాట్లాడుతూ ఏపీ మునిసిపల్ సర్వీస్ యూనిఫైడ్ రూల్స్ 2023 ప్రకారం నగరపాలక, మునిసిపల్, కార్పొరేషన్, గ్రేటర్ మునిసిపాలిటీ ఉపాధ్యాయుల సర్వీసెస్ ఏకీకృతం చేశారని తెలిపారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ విడుదల చేయడం పట్ల కొన్ని ఉపాధ్యాయ సంఘాలు వారి స్వార్థ ప్రయోజనాల కోసం వ్యతిరేకిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. మునిసిపల్ టీచర్స్‌కు పదోన్నతిలో భాగంగా జూనియర్ లెక్చరర్స్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని, మునిసిపాలిటీకి ప్రత్యేకంగా ఎంఈఓ, డీవైఈఓ పోస్టులు కేటాయించాలని తదితర ఇతర అంశాలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల నియంత్రణ అందరి బాధ్యత అని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం యాగర్లపల్లిలో 24, 25 వార్డుల్లో సోమవారం ఫీవర్ సర్వేలు, వెక్టార్ కంట్రోల్ హైజీన్, డ్రై డే, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతే ముఖ్యమని తెలిపారు. నీటిని వృధా చేయకుండా పొదుపు చేయాలని, పొడి వాతావరణం ఉండే విధంగా చూద్దామన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. ఆరోగ్య పరిరక్షణలో వైద్య ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆశలు, శానిటేషన్ సిబ్బంది, అంగన్‌వాడీలు, వలంటీర్లు నేతల కుమారి, కాంతారావు, గంగాభావానీ, నరేష్ పాల్గొన్నారు.


యాగర్లపల్లిలో ర్యాలీలో పాల్గొన్న సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు తదితరులు

లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాతూరులోని లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఆలయ పునర్ నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సారథ్యంలో సోమవారం ఆలయం వద్ద శంకుస్థాపనకు భూమి పూజ నిర్వహించారు. అర్చకులు వాడపల్లి మాధవాచార్యులు, అగ్నిహోత్రం సుందర రామానుజాచార్యులు బ్రహ్మత్వంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కల్లి వెంకట నాగ శ్రీనివాస్, దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఈవో సుజన కుమార్ మాట్లాడుతూ కొట్టు సత్యనారాయణచే 1 కోటి 33 లక్షల రూపాయలు నిధులు అంచనా వ్యయంతో పునర్ నిర్మాణానికి మంజూరు చేయించారని తెలిపారు. ప్రధానాలయం పూర్తిగా రాతి కట్టడంతో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చామన ప్రసాద్, పెనుగొండ సత్యవతి, ఎ.పార్వతి, వై.కుమారి, కొట్టు అంజిబాబు, పెనుగొండ ఆంజనేజయులు, ఆర్యవైశ్యులు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు తదితరులు హాజరైయారు.


శంకుస్థాపన దృశ్యం

ఆర్థిక సాయం అందజేత

పెంటపాడు: మండలంలోని కునాకరపేట ప్రాంతానికి చెందిన తాడి దానిరెడ్డి ఈనెల 22న పొలం వద్ద విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సందర్భంగా పెంటపాడుకు చెందిన గ్రామ ఉపసర్పంచ్, ఎంబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. దీంతో పాటు ప్రభుత్వం తరపున మట్టి ఖర్చుల కింద రూ. మరో 10 వేలు సాయం అందించారు. ఈ మొత్తాన్ని ఆయన భార్య సోమాలమ్మకు అందించారు. ప్రమాదంలో మృతి చెందిన దానిరెడ్డిని విద్యుత్ శాఖకూడా మానవత దృష్టితో ఆర్థికంగా ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, వలంటీర్లు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.


సోమాలమ్మకు రూ. 20 వేలు సాయం అందజేస్తున్న పెంటపాడు గ్రామ ఉపసర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, తదితరులు

ఘనంగా కార్పెంటర్స్ డే

తణుకు అర్బన్: సేవే లక్ష్యంగా తణుకు పట్టణ కార్పెంటర్స్ సంఘం పనిచేస్తుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంపటాపు శ్రీమన్నారాయణ అన్నారు. కార్పెంటర్స్ డే సందర్భంగా సోమవారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముందుగా తణుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 3వ నంబరు మునిసిపల్ పాఠశాలలో సంఘ సభ్యు లు పాడైన బల్లలు, బాత్ రూమ్ డోర్సు వంటి పనులు ఉచితంగా బాగుచేశారు. అనంతరం డంపింగ్ యార్డులో ఉన్న పేదలకు ఆహార ప్యాకెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ సెక్రటరీ గోడి నాగబాబు, సంఘ అధ్యక్షుడు కలగర్ల శేషగిరిబాబు, సంఘ ప్రధాన కార్యదర్శి కొప్పోజు కొండబాబు, కోశాధికారి చిక్కాల సూర్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.


తణుకులో కార్పెంటర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, సంఘ సభ్యులు

మహిళల ఆర్థిక వికాసానికి సంక్షేమ పథకాలు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి

అత్తిలి: మహిళలు ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను రికార్డు స్థాయిలో అమలు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం అత్తిలి వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో డ్వాక్రా మహిళలకు రూ. 25200 కోట్లు అప్పుగా ఉండగా, మూడు విడతల్లో రూ. 19,179 కోట్లు తీర్చామని అన్నారు. మిగిలిన రూ. 6400 కోట్లు వచ్చే ఏడాది నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా చెల్లిస్తామని చెప్పారు. తణుకు నియోజకవర్గంలో 346 ఎకరాలు భూమి కొనుగోలు చేసి 19వేల మందికి ఇళ్లపట్టాలు అందచేసినట్లు స్పష్టం చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యారావు, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, గ్రామ సర్పంచ్ గంటా విజేత నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ మెంబరు హబీబుద్దీన్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ కందుల సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షులు రంభ సూరిబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షులు కోరుకొల్లు వెంకట్రావు, ఏపీఎం మురళి పాల్గొన్నారు. 0


అత్తిలిలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు నమూనా అందిస్తున్న మంత్రి కారుమూరి

మండపాకలో ఫ్యామిలీ ఫిజీషియన్


యర్రనీలిగుంటలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో ఫ్యామిలీ పిజీషీయన్ కార్యక్రమం నిర్వహించినట్లు రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బంగారు రవి చెప్పారు. సోమవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామ శివారు యర్రనీలిగుంటలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. హెచ్ఈవో ప్రసాద్, హెచ్ వీ వీ రాణి, ఎంపీహెచ్ఎస్ జయరాజు, ఎంపీహెచ్ఏ వైటీ మూర్తి, సుధా, అనూరాధ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచమే ఒక రంగ స్థలం

తణుకు టౌన్: ప్రపంచమే ఒక రంగ స్థలమని, మనమంతా పాత్రధారులమని సాహితీ సామ్రాజ్యం కళా సంస్థ అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు చెప్పారు. ప్రపంచ నాటక రంగ దినోత్సవం సందర్భంగా ఏకపాత్రాభినయం, విచిత్ర వేషదారణ పోటీలను నిర్వహించారు. రంగస్థల కళాకారుడు పురాలశెట్టి సత్యనారాయణను సత్కరించారు. ప్రిన్సిపాల్ కె సత్యవాణి, డైరెక్టర్ డీ శేషగిరిరావు, కవి వీఎస్వీ ప్రసాద్, ఆకెళ్ల శ్రీనివాసు, డీ నాగలక్ష్మీ, భాస్కరరావు, ఎం మోహనరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రజలందరికీ సత్యసాయి ఆశీస్సులు ఉండాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలందరికీ సత్యసాయి ఆశీస్సులు ఉండాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సూర్యనారాయణ, సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కె.రవీంద్ర ప్రసాద్ తెలిపారు. సోమవారం సత్యసాయి ఉచిత నిత్యాన్న సేవా పథకం ఐదవ వార్షికోత్సవాన్ని ఏరియా ఆసుపత్రిలో నిర్వహించారు. వేద పఠనం, నామ సంకీర్తనలు జరిగాయి. ఆసుపత్రిలో భారీ అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్త కొట్టు సత్తిబాబు, ప్రవా శ్రీనివాస్, ఆకుల నవీన్ బాబా, ఎంఎస్ఎస్‌కే జనార్ధనరావు, జంధ్యాల నాగేశ్వరరావు, తోట రాధికా రాణి, ఆకుల వెంకటేశ్వరరావులు మాట్లాడారు. సూపరింటెండెంట్‌ను సత్కరించారు. సత్యసాయి సభ్యులు పర్యవేక్షించారు.


ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను సత్కరిస్తున్న సత్యసాయి సేవా సంస్థ సభ్యులు

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

కాళ్ల : ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరుతూ ఉండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కాళ్లకూరు గ్రామంలో నల్ల రిబ్బన్లు , కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలను అణచివేసే దిశగా నరేంద్ర మోడీ పాలన సాగుతోందన్నారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. వారు చేస్తున్న అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీని నియమించాలని రాహుల్ గాంధీ డిమాండ్‌ని కప్పిపుచ్చుకునే చర్యలో భాగంగా ఈ అనర్హత వేటు వేశారని ఆరోపించారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యుల నిరసన

తణుకు: ప్రైవేటు వైద్యుల పట్ల రాజస్థాన్ ప్రభుత్వం అవలంభిస్తున్న తీరును నిరసిస్తూ తణుకు ఐఎంఏ ఆధ్వర్యంలో సోమవారం తణుకులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రైవేటు ఆసుపత్రులు ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు చేయాలని రాజస్థాన్ ప్రభుత్వం తీసుకువచ్చిన లోపభూయిష్టమైన చట్టాన్ని నిరసిస్తూ శాంతియుతంగా ప్రదర్శన తెలియజేస్తున్న ప్రైవేటు వైద్యులపై పోలీసులు లాఠాఛార్జి చేయడాన్ని సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు తణుకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తణుకు ఐఎంఏ అధ్యక్షుడు ముప్పన రఘు, కార్యదర్శి బి.రమేష్‌చంద్రకుమార్, సభ్యులు తాతిన రామబ్రహ్మం, వి.సుందరరావు, సుంకవల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


తణుకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఎంఏ సభ్యులు